
నిధులెలా సరిపోతాయ్!

• బడ్జెట్‌పై పలువురి అసంతృప్తి • హర్షం వ్యక్తం చేసిన డిప్యూటీ మేయర్

తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పలు భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు బడ్జెట్‌లో ప్రతిబింబించలేదని పలువురు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా విద్యారంగానికి కేటాయించిన నిధులు సరిపోవని పేర్కొన్నారు. అయితే ఇది ప్రజా సంక్షేమానికి పాటుపడే బడ్జెట్ అని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.



మహానగరాభివృద్ధికి వరాల జల్లు


మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, డిప్యూటీ మేయర్

లాలాపేట: తెలంగాణ వార్షిక బడ్జెట్–2024లో హైదరాబాద్ మహానగర అభివృద్ధికి అధికంగా నిధులు కేటాయించడంపై జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం తార్నాకలోని ఆమె కార్యాలయంలో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌పై కార్మిక సంఘం నాయకులు మోతే శోభన్‌రెడ్డితో కలిసి స్పందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధికి బడ్జెట్‌లో వరాల జల్లు కురిపించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

విద్యారంగాన్ని నిరాశపర్చిన బడ్జెట్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర బడ్జెట్ విద్యారంగాన్ని నిరాశపర్చిందని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్‌కుమార్ యాదవ్ గురువారం పేర్కొన్నారు. గురుకులాల సొంత భవనాల నిర్మాణాలు, వాటి అభివృద్ధి పై స్పష్టమైన విధానం ప్రకటించలేదన్నారు. వర్సిటీల అభివృద్ధి రూ.500 సరిపోవన్నారు. తక్షణం బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి నిధులు పెంచాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

బీసీ బడ్జెట్ రూ.20 వేల కోట్లకు పెంచాలి

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీ బడ్జెట్‌ను రూ.20 వేల కోట్లకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనాభలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు కేవలం రూ.9,200 కోట్లను కేటాయించడం దారుణమన్నారు. అనేక కులాల సమూహం గల బీసీలకు కార్పొరేషన్ ఏర్పాటుచేసి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి యువతకు ఉపాధి అవకాశాలకు ఉచితంగా పనిముట్లను అందచేయాలన్నారు.

విద్యారంగానికి అన్యాయం: ఎస్ఎఫ్ఐ

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిధుల కేటాయింపులో తీరని అన్యాయం జరిగిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి ధ్వజమెత్తారు. విద్యారంగానికి గతంలో రూ.15 శాతం కేటాయిస్తామని చెప్పి కేవలం 7.3 శాతం కేటాయించడం దారుణమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.21,389 కోట్లు కేటాయించగా కాంగ్రెస్ రూ.21,292 కోట్లు మాత్రమే కేటాయించిన నిధులు విద్యార్థుల స్కాలర్‌షిప్‌లతో పాటు ఇతర అవసరాలకు సరిపోవన్నారు.

సంక్షేమానికి పాటుపడే బడ్జెట్



లాలాపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క రూ 2,91,159 కోట్లతో అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తెలంగాణ వార్షిక బడ్జెట్–2024లో ఎస్సీ సంక్షేమ కోసం రూ 33,124 కేటాయించినందుకు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్టుమెంట్ వైస్ చైర్మెన్ బి. యాదగిరి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీకి ఎస్సీల పట్ల ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం అన్నారు. ఈ బడ్జెట్ కెటాయింపుతో రాష్ట్రంలోని ఎస్సీల అభివృద్ధి, సంక్షేమానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు.

'నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం'

అడ్డగుట్ట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చేయి చూపించారని అడ్డగుట్టకు చెందిన తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ సుల్తాన్ యాదగిరి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సమితి ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ తెలంగాణకు నిధులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో ప్రఫుల్ రామిరెడ్డి, కేపీఎస్. ప్రసాద్, చంద్రుడు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న తెలంగాణ ఉద్యమకారుల సమితి నాయకులు

పేదల ఆశలు అడియాశలు



అడ్డగుట్ట: తెలంగాణ రాష్ట్రంలో విద్యకు 15 శాతం నిధులను కేటాయిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వాల మాదిరిగానే విఫలమైందని బాలల హక్కుల పరిరక్షణ వేదిక(సీఆర్పీఎఫ్) జిల్లా కార్యదర్శి సీహెచ్. లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యకు సరైన న్యాయం జరగలేదన్నారు. అధికారంలోకి వచ్చిన 7 నెలల తరువాత ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులను కేటాయిస్తారని ఎంతో సంతోష పడిన పేదల ఆశలు అడియాశలయ్యాయన్నారు.

'కేంద్ర బడ్జెట్‌లో కాంగ్రెస్‌ది అవాస్తవ ప్రచారం'


మేకల సారంగపాణి

సికింద్రాబాద్: కేంద్ర బడ్జెట్ విషయంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి విమర్శించారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ప్రజలను తప్పుతోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. రాష్ట్రం నుంచి ఎనమిది మంది ఎంపీలు, అందులో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న క్రమంలో తెలంగాణకు అన్యాయం జరిగే అవకాశం లేదన్నారు. వారందని నేతృత్వంలో రాష్ట్రంలో ప్రత్యేక అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని చెప్పారు. కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొత్తంగా రూ. 8.62 లక్షల కోట్లు కేటాయించిన విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

ఓయూలో ముందస్తు అరెస్టులు

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని వివిధ విద్యార్థి సంఘాలు చలో అసెంబ్లీ పిలుపు మేరకు ఓయూ క్యాంపస్‌లో విద్యార్థి నేతలను ముందస్తు అరెస్టులు చేశారు. గురువారం ఉదయం క్యాంపస్‌లోని ఈ–1 హాస్టల్ నుంచి టీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు విజయ్ నాయక్‌తో పాటు మరికొంతరిని అరెస్ట్ చేసి ఓయూ పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా విజయ్ నాయక్ మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిని నియమించాలని, ఫీజు రీఅంబర్స్‌మెంట్ విడుదల చేయాలని, నీట్‌ను రాష్ట్రాలు నిర్వహించేల అసెంబ్లీలో తీర్మాణం చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రభుత్వ హాస్టల్స్‌లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

బోనాల ఏర్పాట్లపై సమీక్ష



సనత్‌నగర్: హనుమాన్ దేవాలయంలో ఈ నెల 28న జరగనున్న బోనాల ఉత్సవ ఏర్పాట్లపై గురువారం వివిధ విభాగాల అధికారులు పలు అంశాలపై చర్చించారు. ప్రతియేటా లాగానే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పరాశరం రవీంద్రాచార్యులు, రిపుంజయశర్మ, విజయేంద్రవర్మ, శ్రీనివాస్‌గౌడ్, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు. అయితే ఈ సమావేశం అధికారిక సమావేశమా, అనధికారికమా అని పలువురు నేతుల ప్రశ్నిస్తున్నారు.

పద్మారావుగౌడ్‌కు ఆహ్వానం



సికింద్రాబాద్: చిలకలగూడలోని చారిత్మాత్మక కట్టమైసమ్మ దేవాలయంలో ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించే బోనాల జాతర వేడుకలకు హాజరు కావాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్‌ను ఆలయ ధర్మకర్తల మండలి ఆహ్వానించింది. ఆలయ చైర్మన్ గుంటి కృష్ణ, కార్యనిర్వహణ అధికారి మహేందర్ నేతృత్వంలో గురువారం పద్మారావుగౌడ్ నివాసానికి వెళ్లిన ధర్మకర్తలు ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రాన్ని అందించారు.

15 ఏళ్ల లోపు పిల్లలకు వ్యాక్సిన్ తప్పనిసరి

అడ్డగుట్ట: జేఈ వ్యాక్సిన్ వేసుకోవడం ద్వారా విష జ్వరాల వైరస్ వ్యాప్తిని అరికట్టవచ్చని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. అడ్డగుట్టలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన జేఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ ప్రసన్న మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలందరికీ జేఈ వ్యాక్సిన్ వేయించాల్సిన బాధ్యత వారి తల్లిదండ్రులపై ఉందన్నారు. ఆరోగ్య కేంద్రం డాక్టర్ వీరు, బీఆర్ఎస్ నేత లింగాని శ్రీనివాస్, స్కూల్ ప్రిన్సిపల్ అనురాధ, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో బోనాల సందడి



అడ్డగుట్ట: అడ్డగుట్టలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం బోనాల సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు బోనం ఎత్తుకున్నారు. విద్యార్థులు పోతరాజుల వేషధారణలు వేసుకున్నారు. అనంతరం, డప్పు చప్పుళ్లతో పోతరాజుల ఆటల నడుమ బోనాలు ఎత్తుకొని స్కూల్ ప్రాంగణంలో తొట్టెలను ఊరేగించారు.

మరమ్మతు పనులు పూర్తిచేయండి

అడ్డగుట్ట: బోనాల ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి ఆదేశించారు. గురువారం తుకారాంగేట్‌లోని వార్డు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆలయాల వద్ద మరమ్మతుల పనులు త్వరితగతని పూర్తి చేసి లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. జీహెచ్ఎంసీ డీసీ సుభాష్ రావు, బీఆర్ఎస్ నేత లింగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

16 కిలోల గంజాయి స్వాధీనం

సికింద్రాబాద్: ఏపీ రాష్ట్రం ఇఛ్చాపురం నుంచి సికింద్రాబాద్ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్న 14 కిలోల గంజాయిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం... మహారాష్ట్ర జల్నాకు చెందిన కృష్ణభజన్ ఆంబోర్ (21) గంజాయికి బానిసయ్యాడు. కృష్ణభజన్ ఆంబోర్ గంజాయికు విక్రయించడం ద్వారా పెద్దమొత్తంలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా మహారాష్ట్ర నుంచి ఇఛ్చాపురం చేరుకున్నాడు. అక్కడ 14 కిలోల గంజాయిని కొనుగోలు చేసి విశాఖ ఎక్స్‌ప్రెస్‌రైలు ద్వారా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలులో ఎక్కి మహారాష్ట్ర వెళ్లేందుకు రైల్వేస్టేషన్ 6వ ప్లాట్‌ఫామ్‌పై వేచి చూస్తున్న కృష్ణభజన్ ఆంబోర్ పోలీసుల సాధారణ తనిఖీల్లో పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి రూ. రూ. 4 లక్షల విలు చేసే 16 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు అతడిని రిమాండ్‌కు తరలించారు.

ఓపెన్ జిమ్ నిర్మాణ పనులు ఆపండి


కార్పొరేటర్‌కు సంతకాల సేకరణ పత్రాలను అందజేస్తున్న న్యాయవాది

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి మైదానంలో నిరించతలపెట్టిన ఓపెన్ జిమ్ నిర్మాణం పనులను తక్షణమే నిలిపివేయాలని మేడిబావి ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు గురువారం మేడిబావి ప్రాంత వాసులతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని న్యాయవాది, బీజేపీ నాయకుడు ఎం.సురేందర్ నేతృత్వంలో నిర్వహించారు. గురువారం స్థానికుల అభ్యంతరాలను ఆయన సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమతోపాటు జీహెచ్ఎంసీ అధికారులకు అందించారు. ఈ సందర్భంగా సురేందర్ విలేకరులతో మాట్లాడుతూ మేడిబావిలోని మైదానం ప్రస్తుతం మల్టీపర్పస్ మైదానంగా ఉందని అన్నారు. మైదానంలో కాలనీ సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పిల్లలకు క్రీడలు, బతుకమ్మ, సంక్రాంతి మేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉదయపు నడకతోపాటు స్థానికులకు అన్ని కార్యక్రమాలకు సౌలభ్యంగా ఉన్న మేడిబావి మైదానంను ఓపెన్‌జిమ్‌కు పరిమితం చెయ్యొద్దని ఆయన కోరారు.

ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటు



సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండులోని ప్రతిష్టాత్మక శ్రీవీరాంజనేయస్వామి దేవాలయ ధర్మకర్తల మండలి గురువారం ఏర్పాటైంది. ధర్మకర్తల మండలి చైర్మన్‌గా సామాజిక సేవకుడు డి.చందర్‌తోపాటు, ధర్మకర్తల మండలి సభ్యులతో ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. ధర్మకర్తల మండలి సభ్యులుగా కైలాష్ అరుణ్‌కుమార్, బి.నరేశ్, నవీన్‌కుమార్, చింతల హేమలత, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకుడు పాలకుర్తి ప్రవీణ్‌కుమార్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్, స్థానిక కార్పొరేటర్ సామల హేమ తదితరులు హాజరయ్యారు.

లాల్‌బజార్ మహంకాళి ఆలయంలో రంగం

రసూల్‌పురా: తిరుమలగిరి లాల్‌బజార్ మహంకాళి ఆలయ బోనాల జాతరలో భాగంగా గురువారం సాయంత్రం రంగం కార్యక్రమం నిర్వహించారు. రచ్చ శ్రీకాంత్ పచ్చికుండపై నిలబడి భవిష్యవాణి పలికారు. ఈ యేడు పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని, ఆలయానికి భూమి తిరిగి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సీతారామ శాస్త్రీ, జాతర కమిటీ అధ్యక్షులు మురళి ముదిరాజ్ పాల్గొన్నారు. ఫలహారబండ్ల ఊరేగింపులో ఎమ్మెల్యే శ్రీగణేష్. తిరుమలగిరిలోని లాల్‌బజార్ మహంకాళి ఆలయంతో పాటు వివిధ బస్తీల్లోని పలు ఆలయాల వద్ద జరిగిన ఫలహారబండ్ల ఊరేగింపులో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ముఖ్య అతిథిగా హజరై పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ఓయూ ప్రొఫెసర్ రాజేష్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేష్ కుమార్ మలేషియాలో జరిగే అంతర్జాతీయ క్రీడల సదస్సుకు హాజరుకానున్నారు. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో నేటి నుంచి (26న) ఈ నెల 28 వరకు ప్రపంచశాంతి కోసం క్రీడలు అనే అంశం పై అంతర్జాతీయ సదస్సులో పాల్గొని స్పోర్ట్స్ ఫర్ పీస్ అనే టాపిక్ పై పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నట్లు తెలిపారు. గతంలో జపాన్, చైనా, వియత్నాం, థాయిలాండ్, టర్కీ, ఫిలిప్పీయన్స్,, శ్రీలంక దేశాలతో పాటు లండన్ నగరంలో వివిధ అంశాలపై జరిగిన అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని ప్రసంగించినట్లు చెప్పారు.

అధికారులతో కార్పొరేటర్ సమీక్ష

బౌద్ధనగర్: బోనాల పండుగ సందర్భంగా బౌద్ధనగర్‌లోని వార్డు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కార్పొరేటర్ కంది శైలజ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోనాల పండుగను పురస్కరించుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని విధాలుగా జాగ్రత్త చర్యలు, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు.

రీయింబర్స్ నిధులు విడుదల చేయాలి


పీజీ కళాశాల గేట్ ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థులు

రసూల్‌పురా: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్స్ నిధులు వెంటనే విడుదల చేయాలని సికింద్రాబాద్ పీజీ కళశాల గేట్ ముందు ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా కన్వీనర్ బాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచితాలకు కూకుండా విద్యార్థుల పక్షాన ఉండి పెండింగ్‌లో ఉన్న రూ.7వేల కోట్ల ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రణయ్. హరీష్, రాజు, అభి, విహాస్ ధ్రువ, సాయికుమార్ పవన్, సతీష్, పాండురంగ్, మధు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలందరికీ వ్యాక్సిన్ ఇవ్వాలి

బౌద్ధనగర్: పదిహేను సంవత్సరాల లోపు పిల్లలందరూ తప్పనిసరిగా జేఈ వ్యాక్సినేషన్ వేసుకోవాలని కార్పొరేటర్ కంది శైలజ సూచించారు. గురువారం అశోక్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో జేఈ వ్యాక్సినేషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కార్పొరేటర్ కంది శైలజ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రాంభించి పాఠశాలలో విద్యార్థులకు జేఈ వ్యాక్సినేషన్‌ను వేయించారు.

నేడు ప్రకాష్‌నగర్ భూలక్ష్మి అమ్మవారి ఘటం ఊరేగింపు



సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన భూలక్ష్మి అమ్మవారి ఘటం ఊరేగింపును శుక్రవారం నిర్వహించనున్నారు. మొట్టమొదటిసారిగా అమ్మవారి ఘటం ఊరేగింపు ను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈఓ విఠలయ్య పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్త విశాల్ సూదం ఆధ్వర్యంలో జరిగే ఊరేగింపు ఈ నెల 26న శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానుంది. ప్రకాష్‌నగర్‌లోని అన్ని వీధుల మీదుగా అమ్మవారి ఘటం ఊరేగింపు కొనసాగి రాత్రి 8 గంటలకు భూలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్ద ముగుస్తుంది. తొలిసారిగా అమ్మవారి ఘటం ఊరేగింపునకు శుక్రవారం నాంది పలకడం జరుగుతుందని, ఈ సంప్రదాయాన్ని ఏటేటా కొనసాగించనున్నట్లు ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త విశాల్ సూదం తెలిపారు. ఈనెల 28న బోనాలు, 29న రంగం ఉంటుందన్నారు.

సీఎం సహాయనిధి అందజేత


సీఎం సహాయనిధి ఎల్‌ఓసీలు అందిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: వివిధ శస్త్ర చికిత్సల నిమిత్తం ఎమ్మెల్యే కార్యాలయాన్ని ఆశ్రయించిన పలువురికి సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సీఎం సహాయనిధిని మంజూరు చేయించారు. వైద్యఖర్చుల నిమిత్తం మంజూరైన ఎల్‌ఓసీ ధృవపత్రాలను గురువారం పద్మారావుగౌడ్ బాధితులకు అందించారు. చిలకలగూడకు చెందిన అబ్దుల్ షోయబ్, లాలాగూడకు చెందిన వనమాల కృష్ణ, శ్రీనివాస్‌నగర్‌కు చెందిన సంపత్‌కుమార్, సీతాఫల్‌మండికి చెందిన చంద్రకాంత్, పార్శిగుట్టకు చెందిన రేశ్వంత్‌ల శస్త్రచికిత్సల నిమిత్తం మంజూరైన రూ.7లక్షల విలువ చేసే సీఎం సహాయనిధి ఎల్‌ఓసీలను బాధితుల కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజసుందర్, కాసరాబాద్ వెంకటేశ్, గౌడ్ శ్రీను, డైమండ్ సీను తదితరులు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్‌ను డిస్మిస్ చేయాలి



తుకారాంగేట్ ఎస్ఐకి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

అడ్డగుట్ట: వికలాంగులను అవమాన పరిచిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌ను వెంటనే డిస్మిస్ చేయాలని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమెపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో పలువురు వికలాంగులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వికలాంగులను చూసి జాలి చూపాల్సిన ఐఏఎస్ అధికారి ఇలా మాట్లాడడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ వికలాంగులు కూడా సకలాంగులతో సమానంగా బ్రతకాలని రిజర్వేషన్లు కల్పించారన్నారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల వేదిక నాయకులు పులిపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంతానలేమికి ఐవీఎఫ్ అద్భుత పరిష్కారం


ఐవీఎఫ్‌పై అవగాహన కార్యక్రమంలో కళాకారులు ప్రదర్శన

కంటోన్మెంట్: సంతాన లేమితో భాధపడే వారికి ఐవీఎఫ్ అద్భుత పరిష్కారాన్ని చూపుతోందని 'ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ వినేష్ గాధియా అన్నారు. ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం 2024 ను పురస్కరించుకుని సికింద్రాబాద్‌లోని ఫెర్టీ9 'టుగెదర్ ఇన్ ఐవీఎఫ్' ప్రచారంలో భాగంగా 'మ్యూజిక్ ఆఫ్ హోప్' పేరిట ప్రత్యేక సంగీత, వీధినాటక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐవీఎఫ్ శిశువులతో గెట్ టుగెదర్‌ను నిర్వహించారు. మొత్తం 9 'ఫెర్టీ 9' కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రత్యేకంగా రూపొందించిన ఫెర్టీ 9 ట్యూన్‌కు కళాకారులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్. జ్యోతి సి. బుడితో పాటు పలువురు డాక్టర్‌లు, ఫెర్టీ9 ఐవీఎఫ్ శిశువులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఒక రైలు బదులు మరో రైలు ఎక్కి..

నడుస్తున్న రైలులోంచి దిగి యువకుడి మృతి

సికింద్రాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు ఒక రైలు ఎక్కబోయి మరో రైలు ఎక్కాడు.. అయితే తాను ఎక్కాల్సిన రైలు అది కాదని తెలుసుకొని కిందకు దిగాడు. ఈ క్రమంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన సికింద్రాబాద్ రైల్వేపోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వేపోలీసులు తెలిపిన మేరకు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాత పాల్వంచకు చెందిన షేక్‌మహ్మద్ ఆసిఫ్ (27) నగరంలోని ఓమ్ని ఆసుపత్రిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతునన ఆసిఫ్ సమీప బంధువు సహాయంతో ఊరికి వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. బుధవారం సాయంత్రం ఇద్దరూ తాము ఎక్కాల్సిన కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైలుకు బదులు పొరపాటున మరోరైలు ఎక్కారు. రైలు కొద్దిదూరం వెళ్లిన తరువాత తాము పొరపాటున వేరేరైలు ఎక్కినట్లు గుర్తించారు. మౌలాలి రైల్వేస్టేషన్ చేరుకోగానే రైలువేగం తగ్గుతుందని భావించి మౌలాలిలో నడుస్తున్న రైలు నుంచి దిగే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆసిఫ్ ప్రమాదవశాత్తు జారి రైలుకింద పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ ఆసిఫ్ తీవ్రంగా రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు పోస్టమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... ఘట్‌కేసర్–బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్యన గల పట్టాలపై మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందుకుని ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులకు మృతుడి వివరాలు లభించలేదు. సుమారు 30 సంవత్సరాల వయసున్న వ్యక్తి ఉద్దేశపూర్వకంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. మృతుడి ఒంటిపై ఆకుపచ్చని టీ షర్టు, బూడిదరంగు ట్రాక్‌ప్యాంటు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాల కోసం 8712658581, 9866280808 మొబైల్ నెంబర్ల ద్వారా సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరుతున్నారు.